**చల్లగాలి మందమందంగా వీస్తున్న ఆ సమయంలో షామియానా పరదాలతో, జంపఖానా తివాసీలతో అలంకరించిన 'ఆనంద నిలయం' ఆవరణ పెళ్ళికళతో కళకళలాడుతూంది!**

# పూజాఫలం

## మహీధర రామశాస్త్రి

అందమైన షామియానా కింద, ట్యూబులైట్ల కాంతిలో, గురుపీఠం ముందు తివాసీలమీద కూర్చున్న భక్తులు— వింగినున్న చుక్కల్లా మెరిసిపోతున్నారు!

గురు పీఠం ఎత్తుగా స్టేజీమీద వుంది. సోఫా మీద పులి చర్మం, దానిమీద ఎర్రని ముఖమల్ గుడ్డ కప్పి పీఠాన్ని తయారు చేశారు.

గురు పీఠానికి రెండు వైపులా అగరవత్తులు మత్తయిన పొగను గుత్తులు గుత్తులుగా గాలిలోకి వెదజల్లుతూ వెలుగుతున్నాయి. సోఫా చెయ్యిమీద ఓ తెల్లని మెత్తని సెంటు రుమాలు సిద్ధంగా వుంచేరు.

భక్తుల వెనక నుంచి మెల్లగా నడుచుకుంటూ వచ్చిన స్వామి స్టేజీ ఎక్కి పీఠానికి చేతులు జోడించి రెండు నిముషాలు ప్రార్థన జరిపేరు మౌనంగా! భక్తుల కేసి తిరిగి సమస్కరించి. ఒక్కమారు సభంతా కలియజూసేరు స్వామి.

తర్వాత పీఠం మీద కూర్చుని, కళ్ళు మూసుకుని ఓంకారం పఠిస్తూ ధ్యాన ముద్రలోకి వెళ్ళిపోయేరు స్వామి.

భక్తులు భక్తి శ్రద్ధలతో ఒక్కొక్కరే తాము తెచ్చిన మల్లెల మాలలను భద్రంగా తెచ్చి, స్వామి మెళ్ళో వేస్తున్నారు.

ప్రార్థన తర్వాత స్వామి కళ్ళు తెరిచారు. కళ్ళు ఎర్రగ వున్నాయి. ముఖం గంభీరంగా వుంది. అలవాటుగ రుమాలుతో ముఖం తుడుచుకున్నారు స్వామి. ఆ సంకేతం అందగానే, ఎదురుగా ముందు వరసలో కూర్చున్నవారెవరో ఓ భక్తి గీతాన్ని అందుకున్నారు.

హిందుస్తానీ తోడి రాగంలో సొగసుగా సాగిన ఆ గానం భక్తుల హృదయాలను రసమయ జగత్తులోకి తీసుకుపోయింది!

స్వామి గొంతు సవరించుకుని, ఉపన్యాసం ప్రారంభించేరు.

ఇందిర, నారాయణ బాహ్య ప్రపంచాన్ని మరిచి స్వామి వుపన్యాసాన్ని చెవులప్పగించి వింటున్నారు- స్వామిగూపం ఇందిర నారాయణల హృదయాలమీద గాఢంగా హత్తుకుంటూంది! కళ్ళు తెరిచినా మూసినా ఆ రూపమే సాక్షాత్కరిస్తూంది.

ఇందిర, నారాయణ కొత్త భక్తులు.

*　*　*

ఆ రోజు మధ్యాహ్నం పూజ పన్నెండు గంటలకు పరిసమాప్తం కాగానే, ఆనంద నిలయంలో సంతర్పణ జరిగింది. భక్తులంతా నవకాయ పిండివంటలతో భోంచేసి భుక్తాయాసంతో లేచేరు!

మధ్యాహ్నం మూడు గంటలయింది.

ఆంజనేయులు వచ్చి మేడ మెట్లమీద కూర్చున్నాడు. ఆంజనేయులు స్వామివారి ప్రియశిష్యుడు. స్వామి మూడునుంచి సాయంత్రం అయిదు వరకూ భక్తులకు ప్రత్యేక దర్శనం యిచ్చి భక్తుల కోర్కెలు తీరుస్తారు. భక్తుల బాధలన్నీ విని, ఓదార్చి సలహా లిస్తారు.

ఆడయినా, మగయినా ప్రత్యేక దర్శనానికి ఒంటరిగానే వెళ్ళాలి. అక్కడ జరిగిన విషయాలు బయట వెల్లడించ కూడదు!






ఇవి ఆనంద నిలయం నియమాలు.

మూడు గంటలకే ఇందిర, నారాయణ మేడ మెట్ల దగ్గరకి చేరుకున్నారు. ఆంజనేయులు అనుమతించలేదు పైకి వెళ్ళడానికి.

భక్తుల సమస్యలను బట్టి సమయం అయిదు నిముషాల నుంచి అరగంట వరకూ వుంటుంది! గంట గంటన్నర సేపు దర్శనం తీసుకునే భక్తులు కూడా లేకపోలేదు!

స్వామి పట్టుపరుపు, బాలీసుల మీద విశ్రాంతి తీసుకుంటూ వుండగా, లోపలకి రాజా అడుగు పెట్టేడు- లోపలకి వస్తూనే స్వామి కాళ్ళమీద పడ్డాడు. తర్వాత లేచి కూర్చుని—

"రవణయ్యతో విడిపోయి. ఈ సంవత్సరం నా వ్యాపారం నేను చేసుకుందావనుకుంటున్నానండి!"

"ఊఁ!"

"లెక్కలు తేల్చేసి, రవణయ్య డబ్బు భగీరథమ్మకు యిచ్చేస్తానండి!"

"ఊఁ!"

"అనుజ్ఞ అయితే వెళ్ళొస్తానండి!"

"పూజలకి ఎన్ని బస్తాల బియ్యం యిచ్చావ్?"

"ఓ బస్తా యిచ్చుకున్నానండి!"

"అయిదు బస్తాలు వేసుకో!"

"అంత సమర్థత లేదండి!"

"వెర్రివాడా! ఇస్తున్నకొద్దీ వస్తుంది! కొత్తగా వ్యాపారం ప్రారంభిస్తున్నావు! అణావాటా తెచ్చి పూజల్లో అమ్మపేరిట అర్పించుకో! వెళ్ళు!"

"చిత్తం."

మరో మారు స్వామి పాదాలమీద పడి, బయటపడ్డాడు రాజా.

రాజా బయటకు రాగానే, రవణయ్య భార్య భగీరథమ్మ మెట్లు ఎక్కింది. ఆంజనేయులు చిరునవ్వుతో పలకరించాడు. భగీరథమ్మకు నెత్తిమీద జుట్టు పలచబడి వంఠ బారింది. తెల్లచీర తెల్లజాకెట్టు, వేలుముడిలో వుంది.


గది బయటనుంచే దండాలు పెట్టుకుంటూ నెమ్మదిగా లోపలికి అడుగు పెట్టింది. వెడుతూనే కాళ్ళమీద పడింది.

"లేచి కూర్చో!"

"స్వామీ! రాజా ఈ సంవత్సరం నుంచి వ్యాపారంలో వాటా యివ్వనంటున్నాడు."

"అవును! విన్నాను! నీ భర్త పోయి రెండు సంవత్సరాలు దాటినా, తనే పని చేస్తూ నీకు వాటా పెడుతూ వచ్చాడు. నువ్వు వ్యాపారంలో ఏ రకంగానూ సాయపడలేవు కదా? నీకూ బరువు బాధ్యతలు తీరిపోయాయి! డబ్బు ధ్యాస తగ్గించుకుని యిక భగవద్ధ్యానంలో పడు!"

"నా గొలుసు, పట్టెడ, వడ్డాణం




దాచడం కష్టంగా వుంటోంది స్వామీ! ఏ పిల్లకి పడితే ఆ పిల్లకే ఆశ వాటిమీద! ఏ అల్లుడికివ్వకపోతే ఆ అల్లుడికే కోపం! వీళ్ళుకాక- ఇన్‌కంటాక్సువాళ్ళ భయం! రాత్రిళ్ళు నిద్దరపట్టడంలేదు స్వామీ!"

"వాటినితెచ్చి మాకు అప్పగించు! మా దగ్గర భద్రంగా వుంటాయి. వెళ్ళిరా!"

"సెలవు స్వామీ!" అంటూ వంగి నమస్కరించింది భక్తితో!

తర్వాత కొంగు నిండాకప్పుకుని బయట పడింది. ఆంజనేయులు మెట్లదగ్గర కునికి పాట్లు పడుతున్నాడు.

ఇందిర, నారాయణ మెట్లు సగం ఎక్కి బెరుగ్గా ఆంజనేయులుకేసి చూస్తున్నారు. అప్పటికి నాలుగుసార్లు— "కొత్తవాళ్ళకి ప్రత్యేక దర్శనం యివ్వరు!" అని తిప్పి పంపేశాడు ఆంజనేయులు.

ఇందిరకి పెళ్ళయి అయిదు సంవత్స రాలు దాటిపోయినా, సంతానం కలగడం లేదు!

నారాయణ శక్తివంచన లేకుండా, తన ప్రయత్నాలన్నీ చేస్తూనే వున్నాడు! భర్త ప్రయత్న లోపం ఏమీ లేదని ఇందిరా ఎరుగును! హాస్పిటలువాళ్ళు కూడా— "అన్నీ సవ్యంగానే వున్నాయి!" అన్నారు.

మరి - నెల తప్పకపోవడానికి కారణం అర్థం కావడం లేదు.

ఎవరేది చెప్తే అది చేసింది ఇందిర.

అశ్వత్థ ప్రదక్షిణాలు చేసింది!

అదేదో వూరెళ్ళి స్తంభాన్ని కౌగలించు కుంది!

మరో వూరెళ్ళి గుడి వెనకాల రాయి పెట్టి వచ్చింది.

ఎక్కడెక్కడికి వెళ్ళి ఎన్నెన్ని చేసుకుని రావాలో అన్నీ చేసుకుని వచ్చారు భార్యా భర్తలు! అయినా లాభం లేకపోయింది! నెల తిరిగి వచ్చేసరికి జీతం రావడంవన్నా ఆలశ్యం అవుతుంది కాని, "అది" మాత్రం ఒక్కరోజు కూడా ఆలశ్యం కావడంలేదు! ఈ చింత తప్పలేదు.

భార్యా భర్త లిద్దరూ ఉద్యోగాలు చేసి గడిస్తున్నారు.

ఎవరో చెప్పేరు 'ఆనందనిలయం' స్వామి సంగతి!

"నాకు వారి దర్శనం అయేకే పిల్లలు పుట్టేరు!" అన్న సాక్షులు పెరిగాక- "సరే! మనం మాత్రం ఎందుకు ప్రయత్నించ కూడదు?" అనుకుని, ఆనంద నిలయానికి వచ్చి చేరేరు ఇందిర, నారాయణాను.

తొమ్మిదిరోజులు అతి శ్రద్ధగా స్వామి పూజాకలాపాలు చూశారు. భోజనాలు చేశారు. భోక్తలని భ్రమపడకుండా వుండేందుకుగాను వెయ్యినూటపదహార్లు చదివించుకుని, నిత్యం మల్లెమాల అర్పించుకుని భక్తులనిపించు కున్నారు.

ఎన్నిచేసినా— "కొత్త భక్తులు కొత్త భక్తులే" అంటున్న ఆంజనేయులి ధోరణి ఆ యిద్దరికీ అసలు నచ్చడంలేదు!

"తాలూకా ఆఫీసు బంట్రోతు నయం! ఓ రూపాయి పారేస్తే, చూపించిన చోటల్లా ముద్దర్లు గుద్దుతాడు! వీ డెక్కడ దాపురిం చేడు మన ప్రాణానికి? స్వామి దర్శనం కావాలంటున్నాంగాని, ఆయన్నేం కొరుక్కు తింటామంటున్నామా?" అనుకున్నారు.

ఉన్నట్టుండి, ఇందిరకో ఆలోచన వచ్చింది. భర్తని మెట్ల కింద దూరంగా వుండమని, తను ఒంటరిగా ఆంజనేయులు దగ్గరగ వెళ్ళింది.

"చూడండి! ఏమయినాసరే— మాకు స్వామి దర్శనం కావాలి! రేపు మళ్ళా వెళ్ళి పోతారు! పది రోజుల నుంచి ఇక్కడే వున్నా ఒక్క ముక్క మాట్లాడలేకపోయాం!" బాధగా అంది ఇందిర.

"ఏమిటి మీ సమస్య? కొత్త వాళ్ళకి అందులోనూ ఇద్దరికి ఒక్కమారు దర్శనం యివ్వరు! మీకు తెలీదు! మిమ్మల్ని పైకి పంపితే, స్వామి నన్ను కొట్టినంత పని చేస్తారు!"

"నాకు వివాహం అయి, అయిదు సంవత్సరాలు అయింది. సంతానం కలగడం లేదు! ఎన్నో పుణ్యక్షేత్రాలు దర్శించాం; లాభం లేకపోయింది! స్వామి దర్శనం చేసుకుంటే సంతాన ప్రాప్తి ఖాయం- అని నమ్మకంగా పది మంది చెప్తే పనిగట్టుకుని యిక్కడకు వచ్చాం! మీరు దయదలచకపోతే ఎలా?"

ఇందిర గట్టిగా అడిగేసరికి, ఆంజనేయులు పంతం సడలించి, పొందికగా విన్నాడు. విషయం అర్థం చేసుకున్నాడు.

అప్పుడు ప్రసన్నంగా ముఖం మార్చుకుని, "ద్వాదశ లింగార్చన కోసం వచ్చేమని చెప్పి వుంటే, ఎప్పుడో పంపివుండే వాడిని! సరే - మీ రొక్కరే వెళ్ళండి! స్వామి అనుగ్రహిస్తే ఫలం ఖాయం!" అంటూ పక్కకి తప్పుకున్నాడు.

ఇందిర కిందనున్నభర్తకు చేయి ఆడించి గుండెలు తడబడుతుండగా- ధైర్యం తెచ్చుకుని, స్వామి గదిలోకి అడుగుపెట్టింది.

* * *

ఇందిర పూజలు ముగించుకొచ్చిన తొమ్మిది మాసాలకు పూల చెండులాంటి

ఆడపిల్లను కంది! అసలు కులదీపకుడులాటి కొడుకునే కనివుండేది. స్వామి విధించిన ఆంక్షను అధిక్రమించి, గోప్యమైన ద్వాదశ లింగార్చన పద్ధతి గురించి భర్త నారాయణకు చెప్పేసింది!

ఇందిర చెప్పకపోను! చెప్పేదాకా నారాయణే వదిలిపెట్టలేదు! స్వామి ఏం చేశారని ఇందిర ప్రాణం తోడేశాడు నారాయణ.

"అయ్యో! అటువంటి దేవ రహస్యాలు బయటపెట్టకూడదని స్వాముల ఆజ్ఞండీ బాబూ!" అంటూ ఇందిర కప్పదాటులు వేసినా, నారాయణ భల్లూకంలా పట్టుకుని వదిలిపెట్టలేదు!

ఎంతయినా భర్త కదా?

చెప్పినట్టూ కాకుండా, చెప్పనట్టూ కాకుండా అసలు జరిగింది మాత్రం చెప్పకుండా, చెప్పడం లేదన్నట్టు అనుమానం రాకుండా — చెప్పుకొచ్చింది ఇందిర!

"సరే— ఏదో స్వామి దయవల్ల సంతు కలిగింది! అదే చాలు!" అని సరిపెట్టుకున్నాడు నారాయణ.

దీంతో నారాయణ ఇంట్లో స్వామి ఆరాధన ఆకాశాన్నంటింది. ఉయ్యాల్లో వున్న పిల్ల కూడా- 'స్వామి' అన్నమాట చెవిన బడితే చాలు, చేతులెత్తి జేజేలు పెట్టడం మొదలుపెట్టింది.

చంటిపిల్లలే అంతగా స్వామి ఆరాధనలో పడ్డప్పుడు, వయసొచ్చిన పిల్ల సుందరి స్వామి కోసం పలవరించిందంటే, వింత, విడ్డూరం ఎందుకు?

ఇందిర చంటిపిల్లతో వేగలేనని చెల్లెలు సుందరిని సాయం తెచ్చుకుంది - పురుడు పోసుకుని వస్తూ.

సుందరి అక్కగారింట స్వామి ఫొటోలు చూసి, ఆయన మహిమలు కథలుగా విని స్వామిమీద భక్తిని పెంచుకుంది. కళ్ళు మూసినా, తెరిచినా స్వామే కనిపిస్తున్నారు. స్వామి సూక్తులే మదిలో మెదులుతున్నాయి.

"ముక్తికి సోపానాలు", "సంసారం నిస్సారం" అన్న స్వామివారి గ్రంథాలు చదివింది- సుందరి. జన్మ ఎత్తినందుకు లక్ష్యం ఒకే ఒక్కటని గ్రహించింది సుందరి - అది మోక్షసాధన!

సుందరిలో గొప్పమార్పు వచ్చింది. పట్టుదల హెచ్చింది.

సుందరి ఒకటే పదం వల్లిస్తూంది- అది స్వామి. ఒకటే లక్ష్యం పెట్టుకుంది- అది మోక్షసాధన! దానికి ఒకటే మార్గంగా ఎంచుకుంది— అది ఉపవాసం!


పైవాళ్ళమాట దేవుడెరుగు, యింట్లో ఇందిర, నారాయణలకే అర్థంకాలేదు సుందరి ధోరణి.

"పెళ్ళికావాల్సిన పిల్లకి ఈ పైత్యం ఏమిటి?" అని సుందరి భక్తిని అపార్థం చేసుకున్నారు జనం!

"ఎంత భక్తి అయితే మాత్రం? ఏదో మన కోరికల్నిబట్టి పూజలుచేస్తాం, వ్రతాలూ చేస్తాం, అవసరం అయితే స్వాముల్ని సేవిస్తాం! అంతేకాని- ఎంత ఇదయినా అంత యిదా?" అంటూ భక్తికి హద్దులూ, సరిహద్దులూ దిద్దేరు కొందరు బుద్ధిమంతులు

సుందరి లోకం సుందరిదే!

చివరికి సుందరిని ఈ లోకంలోకి తేవడానికి చేయని ప్రయత్నం లేదు; చూడని




ఎన్నికల ముగ్గు K. నాగలక్ష్మి

ఈ సంఘంలో
అడుగడుగునా ఎదురయ్యే
ఈర్ష్య, స్వార్థం, మోసం
ఎదుర్కోవాలంటే
ప్రతిమనిషి జీవితంలోనూ
ప్రేమదీపిక
ఎంతో అవసరం!
యద్దనపూడి
సులోచనారాణి
తాజా నవలా సుమం
ప్రేమదీపిక
వెల రూ..15/-లే
సంక్రాంతికి
విడుదల
పోస్టులో
కావాలనుకున్నవారు
రూ..5/-లు ఎమ్.ఓ. చేస్తే
మిగతా రూ..10/-లకి
వి.పి. పెట్టి సంక్రాంతికి
అందేలాగా
పంపిస్తాము
ఆంధ్రప్రదేశ్
బుక్ డిస్ట్రిబ్యూటర్స్
3237 రాష్ట్రపతి రోడ్
సికింద్రాబాద్. 500 003

డాక్టరు లేదు!

డాక్టరు ఓడిపోయాడు.

సైకియాట్రిస్టు కూడా ఎన్ని ట్రీస్టులు చేసినా సుందరిని మనిషివి చేయలేక పోయాడు.

చివరికి—

"ఆపద్బాంధవుడు ఆ స్వామే కరుణించాలి" అన్నారు అంతా!

ఎందుకో ఇందిరకి ఈ ఆలోచన అసలు ఇష్టంలేదు! కాని మనసులో మాట బయటకు చెప్పలేదు!

స్వామి దర్శనం చేసుకుని. సుందరి కథను విన్నవించుకున్నారు ఇందిర, నారాయణ.

స్వామి సాలోచనగా తలవంకించి. సుందరిని పరికించి— "మూడు గంటలకు వచ్చి కలుసుకో!" అన్నారు.

* * *

సుందరి స్వామి గదిలోకి అడుగు పెట్టింది.

స్వామి సుందర వదనం మరింత సుందరంగా అయింది. స్వామి వ్యాఘ్రాజినం మీదపద్మాసనం వేసుకునికూర్చునివున్నారు. ఎదురుగా కంచు పంచపాత్ర. ఉద్ధరిణి. పూజా ద్రవ్యాలు వున్నాయి. స్వామికి ఎదురుగా చిన్న చాప వుంది. దానికేసి చూపిస్తూ. కూర్చోమని సౌంజ్ఞ చేశారు. సుందరి కూర్చుంది.

సుందరి కళ్ళల్లోకి సూటిగా చూస్తూ— "నీ వ్యధ ఏమిటి" అని ప్రశ్నించారు.

"స్వామీ! మీ సూక్తులన్నీ పఠించాను. నాకు మోక్షసాధన మార్గం కావాలి! ఉపవాసం చేస్తూ కోర్కెలను అరికట్టుకుంటూ ఇంద్రియ నిగ్రహం సాధన చేస్తున్నాను. కాని నన్నెవరూ అర్థం చేసుకోడంలేదు! ఈ దీనురాలిని కరుణించి ముక్తిమార్గం సెలవియ్యండి స్వామీ:"

స్వామి అంతా విని చిరునవ్వు నవ్వి. కుడిచేత్తో ఆమె చుబుకాన్నిపట్టి ముఖాన్ని పైకెత్తి తలనిమిరి నుదుటను తిలకం దిద్దారు.

సుందరికి పులకింత కలిగింది ఆ స్పర్శకి కొద్దిగ భయంతో శరీరం వణికింది.

అది గ్రహించిన స్వామి—

"ఎందుకా భయం? పద్మాసనం వేసుకుని కూర్చో! కళ్ళు మూసుకో! మనసును ప్రశాంతంగ వుంచుకో! ఎటువంటి ఆలోచనలనూ రానీకు!" అంటూ సాధనా విధానం సుబోధకంగా వివరిస్తూ మధ్యమధ్య కళ్ళు మూసుకుని కూర్చున్న సుందరిని స్పృశిస్తూ ప్రశ్నిస్తున్నారు స్వామి.

"మెదడు ఆలోచనల నుంచి బయటపడడంలేదు స్వామీ!" అంది సుందరి కళ్ళు తెరిచి.

"కళ్ళు తెరవకూడదు!"

సుందరి మళ్ళీ కళ్ళు మూసుకుంది.

"నీకిప్పుడు రెండు ఉద్ధరిణెల తీర్థం యిస్తా! కళ్ళ కద్దుకుని సేవించు! ఈ తీర్థం నీ మెదడును కూడా నిర్మలంగా మారుస్తుంది. నీ ధ్యాన తీవ్రత పెరుగుతుంది!"

అంటూ సుందరి కుడి చేతిని తన చేతిలోకి తీసుకుని ఉద్ధరిణెతో తీర్థం పోసేరు. సుందరి కళ్ళు మూసుకుని దానిని కళ్ళ కద్దుకుంది. ముక్కుకి దగ్గరవగానే తీర్థం ఓ మత్తులోకి తీసుకువెడుతున్నట్లయింది.

లోపలికు పుచ్చుకోగానే— జుంటితేనియలు జిలేబీరసాల మాధుర్యం కనిపించింది. అతి మధురం!

అయిదు నిముషాలకే సుందరికి వివశత్వం కలిగింది. మాటలు వినిపిస్తున్నాయి. తన శరీరం మీద జరిగే స్పర్శ తెలుస్తూంది. కానీ—కళ్ళు విప్పి చూద్దామన్నా. నోరువిప్పి మాట్లాడుదామన్నా శక్యం కావడంలేదు!

స్వామి ఏ లోకంలోంచో మాట్లాడుతున్నట్టు మాటలు మంద్రంగ. మధురంగ వినిపిస్తున్నాయి. తనెక్కడికో వెడుతూంది. తనిప్పుడు కూర్చునిలేదు! గాలిలో తేలుతున్నట్లు. పూలపై పవళించినట్లు అనుభూతి! మోక్షం ఇదేనేమో? ఏమి స్వర్గ సుఖం!

* * *

కాలం ఎంతసేపు స్తంభించిందో తెలీదు! సుందరి కళ్ళు విప్పి చూసుకునేసరికి — తను వివస్త్రయై స్వామి వక్కన పానుపుపై పడుకుని వుంది. దిగ్గునలేచి చూసింది. ఆదమరచి అమరసుఖానుభూతితో నిదురిస్తున్న స్వామి దర్శనం అయింది.

సుందరి యిప్పుడు సంపూర్ణ జాగృదావస్థలోకి వచ్చి జరిగింది గ్రహించింది!

సుందరి మనో మందిరం భయంకర బంగాళాఖాతంలా తయారయింది. అందులో కోటి తుపానులు!

అపర కాళికలా జుట్టు విరబోసుకుంది!

అక్కడేవున్న కంచు పంచపాత్రలోని తీర్థం స్వామి ముఖంమీద వంపింది. నిద్ర నుంచి లేవడానికి బదులు క్లోరోఫాం ప్రభావంతో మరింత గాఢనిద్రలోకి జారుకున్నారు స్వామి!

ఆ పంచపాత్ర మట్టు తిరగేసి మాడు పగిలేటట్టు కొట్టింది!

ఆ దెబ్బకి కపాలం కొబ్బరికాయలా పగిలింది! స్వామి ఆత్మ బయటపడి. పరమాత్మలో లయం కావడానికి పయనం అయింది!!

